# సాక్షి
## వైఎస్సార్ జిల్లా

సోమవారం । 11 । నవంబర్ । 2024






**యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు**
వేంపల్లెలో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నా.. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. -8లో



**కాలం చెల్లిన సిరప్‌తో బాలుడికి అస్వస్థత**
ప్రభుత్వాసుపత్రి సిబ్బంది రోగులకు కాలం చెల్లిన మందులు ఇస్తూ.. వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.8/21.2

**వాతావరణం**
జిల్లాలో ఆదివారం 21.2 – 32.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### డిసెంబర్ 8న ఉక్కు సాధన సదస్సు


అఖిలపక్షం కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణంతో పాటు, కడప బెంగళూరు రైల్వే పనుల పూర్తి, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం డిసెంబర్ 8వ తేది కడప నగరంలో సదస్సు నిర్వహించనున్నట్లు అఖిలపక్ష నాయకులు వెల్లడించారు. నిరుద్యోగ యువత మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆదివారం కడపలోని అఖిలపక్షం కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ నాయకులు నారాయణరెడ్డి మాట్లాడుతూ విభజన చట్ట ప్రకారం ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ఏ ఒక్క పార్టీ కూడా చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలకే పరిమితం అవుతున్నాయి తప్ప రాయలసీమ అభివృద్ధి కోసం కృషి చేయడం లేదని మండిపడ్డారు. అలాగే ఎన్నో ఏళ్లుగా కడప బెంగళూరు రైల్వే పనులు జరగడం లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని త్వరితగతిన రైల్వే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పరిశ్రమల సాధన కోసం జరుగు సదస్సులో ప్రజలు, యువత, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో అఖిలపక్షం కమిటీ నాయకులు గుర్రప్ప, సిఆర్ వి ప్రసాద్, సత్తార్, సుబ్బరాయుడు, జయవర్ధన్, రవిశంకర్ రెడ్డి, కిషోర్, అంజి, పాపిరెడ్డి, ఓబులేసు, నరసింహ, ప్రసాద్,కృష్ణమూర్తి, దస్తగిరి, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో కడప విజయం

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలబాలికల హాకీ పోటీల్లో కడప జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 500 మందికి పైగా హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం పెదబోదిగల్లం రోడ్డులో ఉన్న హెటిరో హాకీ మైదానంలో జరిగిన బాలికల ఫైనల్స్‌లో వైఎస్సార్ కడప జట్టు 2–1 స్కోర్‌తో విశాఖపట్నం జట్టుపై విజయం సాధించింది. బాలుర విభాగంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు 1–0 స్కోర్‌తో కడప జట్టుపై విజయం సాధించింది. విజేతలకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబరిచిన బాల బాలికలను డిసెంబరు 8 నుంచి 13వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని మాండిసోరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు.

### కంటి సమస్యలపై అవగాహన ముఖ్యం


నడక కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: కంటి వ్యాధులు, సమస్యల పట్ల అవగాహన కలిగి ఇబ్బందులు తలెత్తితే సత్వరమే వైద్య సేవలు పొందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. బాలల నేత్ర సంరక్షణా వారాన్ని పురస్కరించుకుని బాలల్లో కంటి వ్యాధులు, బాల్య శుక్లం వ్యాధులపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఎల్వీపీఈఐ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర సంరక్షణ అవగాహన నడక కార్యక్రమం నిర్వహించారు. కడపలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వద్ద నడక కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓతోపాటు కడప ఎల్వీపీఈఐ డైరెక్టర్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జం మాట్లాడుతూ ఏటా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ బాలల నేత్ర సంరక్షణ అవగాహనా వారం నిర్వహిస్తుంటుందన్నారు. ఇందులో భాగంగా చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్, వక్తృత్వ, క్లే మోడలింగ్, బ్రెయిలీ చదవడం తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నా రు. ఈ సంవత్సరం 'బాల్య శుక్లం' అంశంపై ప్రధానంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలలు, వారి తల్లిదండ్రులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎదురు చూపులేనా!

- డీఎస్సీ నిర్వహణపై మంత్రి హామీతో కదలిక వచ్చినా మళ్లీ స్తబ్దత
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2025 మార్చి నాటికి 1266 ఖాళీల గుర్తింపు
- ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ 748, ఎస్‌ఏ 518 పోస్టులు ఖాళీ
- ఇప్పటికే విడుదలైన టెట్ ఫలితాలు
- కోచింగ్ సెంటర్లలో డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులు


విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు



కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ నిర్వహణపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల చేసిన ప్రకటనతో అధికారుల్లో కదలిక వచ్చినా తరువాత మళ్లీ స్తబ్దత నెలకొంది. ఈనెల 6వ తేదీ తర్వాత డీఎస్సీ నిర్వహణపై ప్రకటన వెలువడుతుందని అభ్యర్థులు ఆశగా ఎదురు చూశారు. ఇప్పటికీ ప్రకటన విడుదల కాకపోవడంతో వారి ఆశలు అడియాశలుగా మిగిలాయి. మళ్లీ అభ్యర్థులకు ఎదరుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఖాళీ టీచర్ పోస్టుల భర్తీకి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికలను కూడా ఉన్నతాధికారులకు పంపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. దీంతోపాటు మంత్రి లోకేష్ డీఎస్సీ నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఇటీవల ప్రకటించారు. ఆ తర్వాత మళ్లీ ప్రకటనపై నోరుమెదపకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే అభ్యర్థులు నెలల తరబడి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు.

**విడుదలైన టెట్ ఫలితాలు..**

అక్టోబర్ 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో జిల్లాలో కడప, ప్రొద్దుటూరు కలిపి 8 కేంద్రాల్లో టెట్ పరీక్షను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 23044 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారం క్రితం ఫలితాలు కూడా విడుదలయ్యాయి. డీఎస్సీ నిర్వహణపై కసరత్తు ప్రారంభం కావడంతో పాటు నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. కానీ ఆ తర్వాత ఎలాంటి ముందడుగు లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

**2025 ఏప్రిల్ 30వ తేదీ వరకు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో 2015 ఏప్రిల్ 30వ తేదీ వరకు ఏర్పడే ఖాళీలను అనుసరించి డీఎస్సీ పోస్టుల భర్తీకి కసరత్తు చేశారు. ఈ ప్రక్రియలో మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1195, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో 71 పోస్టులు వివిధ కేడర్లలో ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఇలా మొత్తంగా రెండు యాజమాన్యాల్లో కలిపి 1266 ఖాళీలు ఉన్నట్లు తేలింది. అయితే ప్రస్తుత డీఎస్సీకి సంబంధించి డిసెంబర్ చివరి వరకు ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. దీని ప్రకారం జిల్లాలో 700కు పైగా పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనే విషయం త్వరలో విడుదల చేయనున్న నోటిఫికేషన్ ద్వారా తెలియనుంది.

**నిబంధనల ప్రకారమే..**



ఉన్నతాధికారులు సూచించిన నిబంధనల మేరకే ఖాళీల భర్తీకి కసరత్తు చేశాం. ఈ మేరకు నివేదికలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపాము. వారు పరిశీలించి ఖాళీల వివరాలను అవసరం మేరకు డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు. దానిని అనుసరించి ముందుకు సాగుతాం.
– మీనాక్షి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

## రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామి సుప్రభాతంతో కార్యక్రమాలు మొదలవుతాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి 8గంటలకు హరికథా, 10 గంటలకు దీక్షా బంధన అలంకారోత్సవం ఉంటుంది. ఇక బుధవారం నిత్య పూజలు,హోమాలు, కలశమహోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయి. అలాగే ఆదేరోజు రాత్రి 8గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం, గ్రామోత్సవం ఉంటాయని తెలిపారు.

- 14న గురువారం ఉదయం 9గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి మండల పూజ కార్యక్రమం, 12గంటలకు మహా నైవేద్యం పంపిణీ, సాయంత్రం కార్తిక సహస్ర దీపార్చన రాత్రికి హరికథ , గ్రామోత్సవం ఉంటాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృప పొందాలని మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు.


దేవస్థానం సమీపంలోని పార్కులో ఉన్న బ్రహ్మంగారి శిలా విగ్రహం


బ్రహ్మంగారిమఠం ఆలయం

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**జిల్లా అటవీశాఖాధికారి వినీత్‌కుమార్**


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి వినీత్‌కుమార్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: అటవీ సంరక్షణ కోసం అహర్నిశలు శ్రమించి విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన అమర వీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ తెలిపారు. అటవీ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖాధికారితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ అటవీ అధికారి రాజశేఖర్ బాబు, సోషల్ ఫారెస్ట్రీ డివిజనల్ అటవీ అధికారి శివకుమార్, కడప, బద్వేల్ సబ్ డివిజనల్ అటవీ అధికారి స్వామి వివేకానంద, కడప రేంజ్ ఆఫీసర్ ప్రసాద్, మినిస్టీరియల్ సిబ్బంది అమర వీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వహించడమే కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు గురికాకుండా కుటుంబాలకు భరోసానిస్తూ అటవీ భూభాగాన్ని, వన్య ప్రాణులను కాపాడి, ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. 1991 వ సంవత్సరం డిసెంబర్ 10 న కిల్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలర్పించిన మన రాష్ట్రానికి చెందిన కర్ణాటక క్యాడర్ ఐఎఫ్‌ఎస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్, సిద్దవటం అడవుల్లో 2018 సంవత్సరంలో తమిళ స్మగ్లర్ల చేతిలో అసువులు బాసిన ప్రొటెక్షన్ వాచర్ అశోక్ కుమార్ సేవలు మరిచిపోలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రసాద్, కడప డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓబులేసు, అధికారులు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, షకీల్‌బాషా, కాశిరెడ్డితోపాటు కడప రేంజ్ స్టాఫ్, డీఎఫ్‌ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగుకు వెలుగునిచ్చిన బ్రౌన్

**సీపీ బ్రౌన్ జయంతి సభలో వైవీయూ వీసీ కృష్ణారెడ్డి**


సీపీ బ్రౌన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ తదితరులు

కడప కల్చరల్: తెలుగుభాషకు కొత్త వెలుగునిచ్చిన మహనీయుడు సీపీ బ్రౌన్ అని.. యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి కొనియాడారు. బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్రౌన్‌లో పట్టుదల ఎక్కువని, కడపను కార్యస్థానంగా తెలుగుభాషను కాపాడుకున్న మహనీయుడని కొనియాడారు. తెలుగు ఉన్నంత వరకు తెలుగువారు ఆయనను మరువలేరన్నారు. ఆయన కీర్తిని విస్తృత పరిచేందుకు డిసెంబరు 12న భవన విస్తరణ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, అతి త్వరలో నూతన భవనాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ పి.సంజీవమ్మ మాట్లాడుతూ తెలుగు భాషోద్ధారకుడిగా బ్రౌన్ తెలుగు వారి హృదయాలలో శాశ్వత స్థానం సాధించారని తెలిపారు. ఆయన కీర్తిని వెలుగులోకి తెచ్చిన డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి రుణం తీర్చుకోలేనిదన్నారు. వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి మాట్లాడారు. తొలుత బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య జి.పార్వతి బ్రౌన్ జీవితం గురించి క్లుప్తంగా వివరించారు. ప్రధాన వక్త స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ వేమనను ప్రపంచానికి పరిచయం చేసిన బ్రౌన్ తెలుగుకు కూడా శాశ్వతత్వం కల్పించారన్నారు. సాహితీవేత్త ఎస్ఆర్ ప్రసాద్‌రెడ్డిని నిర్వాహకులు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. తొలుత అతిథులు బ్రౌన్ చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు.బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**అలరించిన అవధానం**

బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని రెండవ విభాగంలో అవధాని శారద ప్రసన్న ఆధ్వర్యంలో యువ అవధాని ఉప్పల ధడియం భరత్ శర్మ చేసిన అవధానం అందరినీ అలరించింది. వైవీయూ తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య రమాదేవి, డాక్టర్ వెంకట రాం, డాక్టర్ జయంత్ కశ్యప, బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సంకల్ప దీక్ష.. విజయ కాంక్ష

- ఉత్సాహంగా ప్రారంభమైన అగ్నివీర్ ర్యాలీ
- పాల్గొన్న వివిధ జిల్లాల అభ్యర్థులు
- విజయకాంక్షతో లక్ష్యంవైపు అడుగులు: జేసీ అదితి సింగ్


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్


మున్సిపల్ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో భాగంగా పరుగు పోటీల్లో అభ్యర్థులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ ర్యాలీని ఆదివారం వేకువజామున 3 గంటలకు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్‌తో కలసి జెండా ఊపి మొదటి బ్యాచ్ పరుగు పందెం ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థులు మొక్కవోని ఆత్మవిశ్వాసం.. సడలని పట్టుదలతో విజయమే లక్ష్యంగా సంకల్పం బూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ద్వారా దేశ సైన్యంలో చేరేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఇప్పటికే రాతపరీక్ష పూర్తయిన అభ్యర్థులకు ఫిజికల్, మెడికల్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు విజయకాంక్షతో కృతనిశ్చయంతో ముందడుగు వేయాలన్నారు. ఎంపికల ప్రక్రియ పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశానికి భద్రతనిచ్చే, సేవచేసే అవకాశం సైన్యం ద్వారా లభిస్తుందన్నారు. ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచి భారతసైన్యంలో మీరు ఒకరుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికలను ప్రారంభించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు మెడికల్, ఫిజికల్ టెస్టులు నిర్వహించారు. ఇందులో భాగంగా పరుగు పందెం, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, 9 అడుగుల కందం లాంగ్‌జంప్, హైజంప్, బీమ్ పుల్లప్స్ వంటి ఫిజికల్ టెస్టులు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభ్యర్థులకు వసతి సౌకర్యం కల్పించారు. కాగా ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ 800 మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ ఎంపికలకు రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. కడప ఆర్‌డీఓ జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ కోసం క్యూలో నిలబడిన అభ్యర్థులు


అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు


లాంగ్‌జంప్ చేస్తూ..


జిగ్‌జాగ్ బ్యాలెన్స్ చేస్తున్న అభ్యర్థులు

## క్లుప్తంగా

### విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**చాపాడు :** మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఓ మహిళ విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మీదేవి(45) ఇంటి వద్ద మరుగుదొడ్డిలో మోటార్ వేసుకుని నీరు పట్టుకుంటుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగులుకుని విద్యుత్ షాక్‌కు గురైంది. ఆమె పడిపోయి ఉండటాన్ని గుర్తించిన అత్త ఓబుళమ్మ లేపేందుకు ప్రయత్నించగా.. ఈ సంఘటన గమనించిన కుమారుడు రామోహన్ స్విచ్ ఆఫ్ చేయడంతో ఓబుళమ్మ ప్రాణాలతో బయట పడగా, అప్పటికే లక్ష్మీదేవి మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

### గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కొల్హాపూర్–తిరుపతి మధ్య నడుస్తున్న హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తెల్లవారు జామున గంజాయిని స్వాధీనం చేసుకున్నామని కడప రైల్వే జీఆర్‌పీ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారంతో ఎస్–6 బోగీలో దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి 13.5 కిలోలు ఉందని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని ఆయన వివరించారు.

### చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాత


అన్నయ్య మృతదేహం

**చింతకొమ్మదిన్నె(వల్లూరు) :** చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. చింతకొమ్మదిన్నె మండలంలోని ఇప్పెంట గ్రామం యానాది కాలనీ నివాసి తాటిమాకుల అన్నయ్య (54) బుగ్గవంక డ్యామ్‌కు చేపలు పట్టడానికి శనివారం సాయంత్రం వెళ్లాడు. డ్యామ్ వెనక నీటిలో దిగి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. మృతదేహాన్ని పోలీసులు బయటికి తీసి శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రిమ్స్ మార్చురీలో ఇద్దరి మృతదేహాలు



గుర్తు తెలియని మృతదేహాలు

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** రిమ్స్ మార్చురీలో రెండు గుర్తు తెలియని మృతదేహాలు ఉన్నాయని రిమ్స్ అధికారులు తెలిపారు. వారు ఇటీవల ఆసుపత్రిలో చేరారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో వారి పేర్లు ఇలా నమోదయ్యాయని చెప్పారు. టి.సుండుపల్లె మడితాడు చెరువుకిందపల్లెకు చెందిన వారయోగి శ్రీరామమూర్తి (52) ఈ నెల 10న రిమ్స్‌లో చేరాడని, పరిస్థితి విషమించి అదే రోజు మృతి చెందడం జరిగిందన్నారు. అలాగే సిద్ధవరం గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి ఈనెల 7వ తేది రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడని పేర్కొన్నారు. వారి కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ రాలేదని తెలిపారు. వారికి సంబంధించిన వారు ఉంటే తమను సంప్రదించాలని వివరించారు.

# రెండు మండలాల మధ్య ఇసుక గొడవ

- అట్లూరు, సిద్దవటం ట్రాక్టర్ల యజమానుల వాగ్వాదం
- సిద్దవటం ట్రాక్టర్లను అడ్డుకున్న అట్లూరు వాసులు
- అట్లూరు ట్రాక్టర్లకు ఇసుక ఇవ్వని సిద్దవటం ప్రజలు



సిద్దవటంకు చెందిన ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న అట్లూరు ట్రాక్టర్ల యాజమానులు, వాగ్వాదానికి దిగిన ఇరు మండలాల వారు

**అట్లూరు :** కూటమి ప్రభుత్వంలో ఇసుక దోచుకున్న వాడికి దోచుకున్నంత అన్న చందంగా తయారైంది. సిద్దవటం మండలం జంగాలపల్లి దగ్గర, అలాగే జ్యోతి గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి మద్దతుదారులైన ట్రాక్టర్ల యజమానులు కుమ్మక్కై రోజూ సుమారు 20 ట్రాక్టర్ల ద్వారా అట్లూరు మండలంలోకి తీసుకొచ్చి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అయితే అట్లూరు మండలంలోని కొంత మంది ట్రాక్టర్లు ఇసుక కోసం.. సిద్దవటం మండల పరిధిలోని జంగాలపల్లి, జ్యోతి గ్రామాల పరిధిలోని పెన్నానదికి వెళ్లారు. అక్కడ ఆ మండలానికి చెందిన ట్రాక్టర్ల యజమానులు అట్లూరు మండలానికి చెందిన ట్రాక్టర్లకు ఇసుక పోసుకో నివ్వం తమ ట్రాక్టర్లకు మాత్రమే అని పేర్కొన్నారు. అట్లూరు మండలానికి చెందిన ట్రాక్టర్లను వెనక్కి పంపారు. అయితే సిద్దవటం మండలానికి చెందిన ట్రాక్టర్లు తమ మండలానికి వచ్చి ఇసుక ఎలా అమ్ముతారని, తమ మండలానికి మీరు రావద్దు అన్నారు. అట్లూరు మండలానికి చెందిన ట్రాక్టర్ల యజమానులు.. ఆదివారం ఉదయం అట్లూరు చెక్‌పోస్టు సమీపాన వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు మండలాలకు చెందిన ట్రాక్టర్ల యజమానుల మధ్య వాగ్వాదం తారా స్థాయికి చేరుకుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వారిలో కొంత మంది గొడవ ఎందుకు ఈ రోజుకు ఎవరూ ఇసుక తోలవద్దు అని పేర్కొన్నారు. మీ మండల కూటమి నాయకులు, మా మండల కూటమి నాయకులతో పంచాయితీ చేసుకుని మరలా ఇసుక తోలుకుందామని ఇరు మండలాల ట్రాక్టర్ల యజమానులు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

# అక్రమ రవాణా ఆపకపోతే ఆత్మహత్యే

**పురుగుల నివారణ మందు తాగి చస్తామంటున్న రైతు**


పొలంలో పురుగుల నివారణ మందు డబ్బా చూపుతున్న రైతు యోసోబు

**కమలాపురం :** ఇసుక అక్రమ రవాణాతో తమ ప్రాణాలు పోతాయని, తాము ఆత్మహత్య చేసుకోక తప్పదని కమలాపురం పట్టణం అప్పాయపల్లె గడ్డవీధికి చెందిన రైతు యోసోబు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం ఆయన పొలంలో పురుగుల నివారణ మందు డబ్బా చేతపట్టుకుని, విలేకరులతో మాట్లాడాడు. ప్రభుత్వం దళిత రైతులకు ఇచ్చిన పాపాఘ్ని నదికి ఆనుకుని ఉన్న జడ్‌హెచ్‌డీసీ భూముల్లో తాము వరి పంట పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నాడు. అయితే పాపాఘ్ని నది నుంచి అక్రమార్కులు నిత్యం ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండటంతో తమ పంటలన్నీ నాశనం అవుతున్నాయని వాపోయాడు. పొలాల్లోకి వెళ్లే దారుల్లో నుంచి ప్రతి రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లు తిరుగుతున్నాయని, తద్వారా దుమ్ము, ధూళి భారీగా పంట పొలాలపైకి చేరుతోందన్నారు. దీంతో తమ పంట దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయన్నారు. ఒడ్లు వచ్చే సమయానికి ఈ ట్రాక్టర్లు తమ పాలిట శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశాడు. గతంలో ఎకరాకు 24 బస్తాల వడ్లు వచ్చేవని, ఇప్పుడు 9 బస్తాలు కూడా రావన్నాడు. అలాగే ఇసుక అంతా తీసుకెళ్తే నదిలో నీటి శాతం తగ్గిపోతుందన్నాడు. ట్రాక్టర్లు తిరుగుతుండటంతో పైప్‌లైన్లు సైతం పగిలిపోతున్నాయని ఆవేదన చెందాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని, అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్లను పట్టుకుని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. లేని పక్షంలో జడ్‌హెచ్‌డీసీ పొలాల్లో పంటలు సాగు చేసుకునే రైతులంతా పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించాడు. అధికారులు స్పందించి ట్రాక్టర్లు పొలాల దారుల్లో తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు.

# హోరాహోరీగా రగ్బీ పోటీలు


కర్నూలు బాలికల జట్టుకు పతకాలు అందిస్తున్న అతిథులు


నెల్లూరు బాలుర జట్టుకు పతకాలు అందిస్తున్న నిర్వాహకులు

- బాలికల విజేతగా కర్నూలు జట్టు
- బాలుర విజేతగా నెల్లూరు జట్టు

**కమలాపురం :** స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజులుగా 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాలబాలికల రగ్బీ పోటీలు హోరా హోరీగా జరిగాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలకు వేరు వేరుగా పోటీలు నిర్వహించారు. నాకౌట్ పద్ధతిలో సాగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో వైఎస్సార్ జిల్లా జట్టుపై కర్నూలు జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పైచేయి సాధించింది. వైఎస్సార్ బాలికల జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో ఫైనల్‌లో నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టు విజయం సాధించి ప్రథమ స్థానం దక్కించుకుంది. కర్నూలు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు సూర్య ట్రాన్స్‌పోర్ట్ అధినేత సానేపల్లి ప్రసాద్‌రెడ్డి స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణ కుమారి, గేమ్స్ పరిశీలకుడు రమేశ్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కార్యదర్శి అరుణ కుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు తిరుపాల్‌రెడ్డి, శివ శంకర్‌రెడ్డిలు పోటీలు దిగ్విజయంగా నిర్వహించారని కొనియాడారు. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించిన కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, కిరణ్, ప్రవీణ్, అంకాల్‌రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, షాహీన్, ఫాతిమా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాణించిన బ్యాట్స్‌మెన్

**181 పరుగులు చేసిన అనంత బ్యాట్స్‌మన్**


ఆదినారాయణరెడ్డి, అనంతపురం (181 పరుగులు)


గుంటూరు కౌషిక్ (92 పరుగులు)


రామ్‌చరణ్, గుంటూరు (81 పరుగులు)

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ పోటీల్లో బ్యాట్స్‌మెన్ చెలరేగడంతో ఆయా జట్లు మంచి స్కోరు సాధించాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. జట్టులోని ఆదినారాయణరెడ్డి 124 బంతుల్లో 32 ఫోర్లతో 181 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్ భానుచైతన్య 4 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

**కేఎస్ఆర్ఎం మైదానంలో..**

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో శ్రీకాకుళం, గుంటూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. జట్టులోని కె.ఎస్.వి.కౌషిక్ 92 పరుగులు చేశాడు. డింకూ రామ్‌చరణ్ 81, అభినవ్ డేవిడ్ 74 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు సాత్విక్ 4 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

**వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో..**

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, విజయనగరం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విజయనగరం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 80.3 ఓవర్లలో 250 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని అభినవ్ 55 సాయిప్రణీత్ 45, విఘ్నేష్ 42 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ సుశాంత్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 16 పరుగులు చేసింది. జట్టులోని కిన్ను కుశాల్ 13 పరుగులతో నాటౌట్‌గా క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

# మైదుకూరు విద్యార్థులకు బంగారు పతకాలు


పతకాలతో హైస్కూల్ విద్యార్థులు

**మైదుకూరు :** తిరుపతి జిల్లా రేణిగుంటలో శని, ఆదివారాల్లో జరిగిన ఘట్కా (కర్రసాము) పోటీల్లో మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మైదుకూరు హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో అండర్–19 విభాగంలో నాగవేణు, అండర్–17 విభాగంలో నవీన్ బంగారు పతకాలను సాధించినట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని వినోనియా రాణి తెలిపారు. అదే విధంగా అండర్–17 విభాగంలో సురేష్, అండర్–14 విభాగంలో ఉమేష్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను సాధించారని ఆమె వివరించారు. ఈ ఘనతపై పాఠశాల హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్, వ్యాయామ ఉపాధ్యాయినులు వినోనియా రాణి, చంద్రావతి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# కాలం చెల్లిన సిరప్‌తో బాలుడికి అస్వస్థత

**ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం**



మాట్లాడుతున్న బాలుడి తండ్రి శివానంద, ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చిన కాలం చెల్లిన మందు

**బద్వేలు అర్బన్ :** ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది రోగులకు కాలం చెల్లిన మందులు ఇస్తూ.. వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన జితేష్‌కుమార్ అనే నాలుగేళ్ల బాలుడికి కాలం చెల్లిన సిరప్ ఇవ్వడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన శివానంద కుమారుడైన జితేష్‌కుమార్‌కు జలుబు, దగ్గు ఉండటంతో శనివారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడికి క్లోర్‌ఫేనిరమైన్ అనే సిరప్ రాసిచ్చారు. సిరప్‌ను ఆసుపత్రి ఆవరణలోని మందుల షాపులో తీసుకుని ఇంటికి వెళ్లిన తర్వాత బాలుడికి తాపించారు. కొద్దిసేపటికి బాలుడికి చెమటలు పోయడంతోపాటు వాంతులు కావడంతో వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన తర్వాత ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చిన సిరప్‌పై అనుమానం రావడంతో పరిశీలించిన తల్లిదండ్రులు.. ఈ ఏడాది ఆగస్టు నెలలోనే కాలం చెల్లిన సిరప్‌గా గుర్తించారు. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యాన్ని గుర్తించేందుకు తిరిగి ఆదివారం ఉదయం మళ్లీ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోగా.. మళ్లీ కాలం చెల్లిన సిరప్‌నే ఇచ్చారు. దీంతో సిబ్బందికి విషయం తెలిపి వారిపై బాలుడి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. అలాగే ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో మందులు వెనక్కి ఇవ్వాలని సిబ్బంది ప్రాధేయపడినట్లు తెలిసింది.

# యువ ఉత్సవాల్లో ప్రతిభ చాటాలి

– పోస్టర్లు ఆవిష్కరించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**పులివెందుల టౌన్ :** యువ ఉత్సవాలలో ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా యువత ప్రతిభ చాటాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక భాకరాపురంలోని తన నివాసంలో ఈ నెల 16న జరిగే యువ ఉత్సవ్– 2024 పోస్టర్లను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ నెహ్రూ యువ కేంద్రం సేవలు, కార్యక్రమాలను వివరించారు. ఈ ఉత్సవాలలో పెయింటింగ్, కవితవ్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాలలో ఉపన్యాస పోటీలు, కల్చరల్, ట్రెడిషనల్, ఫోక్ (గ్రూప్), సైన్స్ మేళా సింగిల్ గ్రూప్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి, రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయికి పంపుతామన్నారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు ఉంటాయన్నారు. 15 ఏళ్లు నిండిన యువత పేర్లు నమోదు చేసుకోవాలనుకునే వారు 9177616677 అనే ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది సుబ్బారావు, సుబ్బయ్య, అరవింద్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

**సత్తెనపల్లి :** రాష్ట్రస్థాయి అండర్ –19 ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా, బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్లు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. బాలికల విభాగంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. వైఎస్సార్ కడప జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

# యథేచ్ఛగా గ్రావెల్ మట్టి తవ్వకాలు

- టీడీపీలో వర్గ పోరుతో భగ్గుమన్న విభేదాలు
- ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


మట్టి తవ్వకాల వద్ద ఉన్న టీడీపీ నాయకులు


మట్టి తవ్వకాలలో జేసీబీ, ట్రాక్టర్

**వేంపల్లె :** వేంపల్లెలో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేస్తున్నా.. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం పాములూరు పంచాయతీలోని గుట్ట సమీపంలో టీడీపీలో ఒక వర్గం నాయకులు మట్టి తవ్వకాలు చేస్తుండగా.. మరోవర్గం నాయకులు అడ్డుకోవడం జరిగింది. దీంతో టీడీపీ వర్గ పోరు రోజురోజుకు తారాస్థాయికి చేరుకుంటోంది. అంతేకాకుండా నువ్వు తోలొద్దంటే.. నువ్వు తోలొద్దంటూ టీడీపీలో రెండు వర్గాలు గొడవ పడుతున్నాయి. పులివెందుల జోన్ రాయల్టీ అధికారి సురేష్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెండ్లిమర్రి మండలానికి చెందిన ఆర్.రామాంజనేయరెడ్డికి 2025 ఫిబ్రవరి వరకు గ్రావెల్ మట్టి తవ్వుకునేందుకు లీజు ఉండగా.. అతని దగ్గర నుంచి టీడీపీ సింగారెడ్డి జయరామిరెడ్డి, సోదరుడు జయ చంద్రారెడ్డి సబ్ లీజుకు తీసుకున్నారు. వేంపల్లెలోని రాజీవ్ కాలనీ సమీపంలో సర్వే నంబర్ 1/పి 4.96 హెక్టార్లు అనగా 12 ఎకరాలలో గ్రావెల్ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. అయితే శనివారం వేంపల్లె టీడీపీ మండల కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డి వర్గం అడ్డుకుంది. వారికి ఎటువంటి అనుమతులు లేవని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ తిరుపాల్ నాయక్ అక్కడికి చేరుకుని మట్టి తవ్వకాలను ఆపివేశారు. ఆ తర్వాత లీజుకు సంబంధించి అన్ని పేపర్లను తీసుకు రావడంతో వారిని వదిలేశారు. ఆ తర్వాత ఆదివారం పాములూరు, అయ్యవారిపల్లె గ్రామ సమీపాలలో సింగారెడ్డి రామ మునిరెడ్డి వర్గానికి చెందిన కొండయ్య, శేషగిరి అనే వ్యక్తులు గ్రావెల్ మట్టి తవ్వకాలను చేస్తుండగా సింగారెడ్డి జయ చంద్రారెడ్డి తన మనుషులతో వచ్చి అడ్డుకున్నారు. అక్కడ వారు మాకు సంబంధించిన డీకేటీ భూమిలో మేము మట్టి తవ్వకుంటుంటే.. నువ్వు ఎవరు అడ్డు చెప్పడానికి అని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీలోని రెండు వర్గాలు వాగ్వాదపడడంతో పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. అంతలోపే పులివెందుల జోన్ రాయల్టీ అధికారి సురేష్ అక్కడికి చేరుకుని రాయల్టీ పేపర్లు లేకుండా ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలు చేయకూడదని జేసీబీ, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో టీడీపీలో ఉన్న రెండు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. టీడీపీలో రెండు వర్గాలు ఇమడలేకపోవడంతో రోజు రోజుకు వర్గ విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. అలాగే వేంపల్లె మండలాన్ని అభివృద్ధి చేయకపోవడమే కాక.. ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటున్నారు. అంతేకాకుండా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచిత హామీ ఇవ్వడంతో.. టీడీపీలో ఒక వర్గం పగలంతా ట్రాక్టర్లతో ఇసుకను డంప్ చేసుకొని రాత్రి వేళల్లో లారీలలో బెంగళూరు, తమిళనాడు ప్రాంతాలకు తరలిస్తుండడంతో, మరో వర్గం రాత్రి వేళల్లో కాపలా కాసి మరీ పోలీసులకు పట్టిస్తుండడం చూసి పలువురు ప్రజలు నవ్వుకుంటున్నారు. టీడీపీలో ఒకరికొకరు కుమ్ములాడుకోకుండా వేంపల్లె మండలం అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### వాటర్‌గండిలో మునిగి వ్యక్తి మృతి


మృతి చెందిన బిల్లపాటి బాబు

**కడప కోటిరెడ్డిసర్కిల్/వల్లూరు (చెన్నూరు) :** కడప నగర శివారులోని వాటర్ గండిలో మునిగి ఒక వ్యక్తి మృతి చెందినట్లు చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కడప నగరం తిలక్‌నగర్‌లో ఉంటున్న బిల్లపాటి బాబు, తన సమీప బంధువు రవికుమార్‌తో కలిసి విహారయాత్రలో భాగంగా వాటర్ గండి ప్రాంతానికి వెళ్లడం జరిగింది. భోజనం అనంతరం ఈత కొడుతూ బిల్లపాటి బాబు పెన్నా నది ప్రవాహానికి మునిగి మృతి చెందాడు. ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా రేవూరు గ్రామానికి చెందిన మృతుడు బిల్లపాటి బాబు ఉపాధి నిమిత్తం కడపకు వచ్చి బంధువుల ఇంటిలో ఉంటున్నట్లు సమాచారం. ఈ మేరకు మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### బకాయిల చెల్లింపులో జాప్యం తగదు


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

**కడప ఎడ్యుకేషన్ :** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు అన్నారు. ఆదివారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ ఆరు నెలల లోపల పూర్తి స్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు మాసాలైనా ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం తగదన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షులు రవికుమార్, సుజాత రాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, శ్రీనివాసులు, చెన్నయ్య, ఎజాస్ అహ్మద్, శ్రీనివాసులు, మురళీకృష్ణ, లక్ష్మిప్రసన్న, బాలజోజి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్‌రెడ్డి, రూతు ఆరోగ్య మేరి, కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, ఐక్య ఉపాధ్యాయ పత్రిక బాధ్యుడు గాజులపల్లె గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై దాడి

- రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చాడనే అనుమానంతో..

**ప్రొద్దుటూరు క్రైం :** అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాల సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు ఇచ్చి ఉంటాడనే అనుమానంతో సూలం శివరాముడుపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని తిమ్మయ్య కాలనీకి చెందిన శివరాముడు గతంలో 5వ వార్డులోని 22వ రేషన్ డీలర్‌గా ఉండేవాడు. రెండు నెలల కిందట అతన్ని డీలర్‌గా తొలగించారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ సమాచారాన్ని శివరాముడు ఇచ్చి ఉంటాడనే అనుమానంతో పట్టణంలోని మద్దూరు నాగేంద్ర, సంజీవ మరికొందరు వ్యక్తులు కలిసి ఆదివారం సాయంత్రం దాడి చేశారని అతను త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

### రాజంపేటలో హోటళ్ల తనిఖీ

**రాజంపేట :** రాజంపేటలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. 27 హోటళ్లలో తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీలు జిల్లా ఆహార భద్రతా అధికారి డాక్టర్ కె షమీం, ఆహార భద్రత అధికారులు కె ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ పి సీతారామయ్యలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రతా అధికారి డాక్టర్ షమీం మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 చట్టం నిర్దేశించిన ఫుడ్ లైసెన్సు నోటీసులు జారీ చేస్తామన్నారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాలలో రంగులు ఉపయోగించరాదన్నారు.